# డాక్టర్.మిస్ ప్రియ

కృష్ణజ

టంగ్... టంగ్... టంగ్..

గోడ గడియారం పదకొండు గంటలు కొట్టింది అతి భారంగా.

పడకగదిలో మంచం మీద పడుకుని టేబుల్ మీది ఫోటో ఫ్రేం వైపు చూస్తున్న "డాక్టర్ మిస్.ప్రియ" గుండెలువేగంగా కొట్టుకున్నాయి.

పదకొండు గంటలయింది...పదకొండు గంటలయింది..."

నెమ్మదిగా గొణుగుతూ హడావిడి పడుతున్నట్లుగా లేచి వరండాలోకి వచ్చింది.

మనస్సుకున్నంత వేగిరపాటు శరీరానికి లేక అడుగులు తడబడ్డాయి. స్వాధీనంలోకి రాని మోకాలివి సరిచేసుకుంటూ, కుంటుతూ నడచి వచ్చి వరండాలో వున్న ఈజీ ఛైర్‌లో కూర్చుంది.

ఆమె కళ్ళు వీధివంక తదేకంగా చూస్తున్నాయి.

నీళ్ల కమ్ముతున్న కళ్ళను పదే పదే పవిట చెంగుతో అద్దుకుంటూ మరీ నిరీక్షిస్తోంది.

మరో పావుగంటకు ఆమె నిరీక్షణ ఫలించింది.

దూరంగా సైకిల్ త్రొక్కుకుంటూ వచ్చే పోస్ట్ కుర్రాడిని చూస్తూనే ఆమె కళ్ళు ఆనందం నింపుకున్నాయి.

ఆమె ఆ ఆనందం ఎక్కువసేపు అనుభవించకుండానే, సైకిల్ మీద రివ్వున వెళ్తూ, "డాక్టర్‌గారూ! మీకేమీ లేవండీ.." అంటూ ముందుకు వెళ్లిపోయాడు పోస్ట్‌మాన్.

ఎండిపోయి గుంటలు పడిన డాక్టర్.మిస్.ప్రియ కనుకొలకుల్లో రెండు చిన్ని కన్నీటి బిందువులు చోటు చేసుకున్నాయి.

వణుకుతున్న చేతులతో పవిట చెంగుతో రెండు కళ్ళూ గట్టిగా వత్తుకుంది.

"అని" ఈరోజు కూడా వుత్తరం వ్రాయలేదు... అంటూ పదే పదే గొణుక్కుంది ఆర్తిగా"

"నాన్నా! అని. ఈ ముసలి తల్లి నీకు గుర్తే రాదా...?" అనుకుంది కన్నీటి తెరల మధ్య.

'నాది ఒంటరి బ్రతుకు... నాకెవ్వరూ లేరు... భర్తలేదు... కొడుకులేదు... నాకెవ్వరూ లేరు... నాకు నేనే.... నాకు నేనే...." పిచ్చిగా గొణుగుతూ నవ్వుకుంది.

నవ్వుతూ ఏడ్చింది.

చివరికి అలసి పోయినట్లుగా అలా శూన్యంలోకి చూస్తూండి పోయింది డాక్టర్ మిస్.ప్రియ.

* * * *

డాక్టర్ మిస్.ప్రియ వయస్సు అరవై సంవత్సరాలకు పై బడుతున్నాయి.

ఈ వయస్సులో ఆమెను 'డాక్టర్ మిస్.ప్రియ' అనడం కొంత ఎబ్బెట్టుగానే ఉన్నమాట నిజమే అయినా, ఆమె పేరు ప్రియే.

ఆమె ఎమ్.బి.బి.ఎస్ చేసిన డాక్టరే....

అయితే కొడుకున్నాడు కాబట్టి ఆమెను 'మిసెస్' అనేందుకు వీల్లేదు.

డాక్టర్.మిస్.ప్రియ కొడుకు డాక్టరు. అయితేఫారిన్ లో డాక్టరుగా జాబ్ చేస్తూ ఫారిన్‌లోనే సెటిల్ అయిపోయాడనే విషయం ఆ కాలనీలో అందరికి తెలుసు.

ఆ కొడుకు నుండి 'రాని' జాబుకొరకు ఆమె అలా ప్రతిరోజూ నిరీక్షిస్తుందనే విషయం కూడా అందరికీ తెలుసు.

డాక్టర్.మిస్.ప్రియ కొడుకు రాకకోసం, అతని జాబుకోసం రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలుగా ఎదురు చూస్తూ జీవచ్ఛవంలా గడుపుతోంది.

"డాక్టర్. మీ అబ్బాయి లెటర్ వ్రాశారా...?" అని ఎవరైనా అడిగితే, 'లేదమ్మా! ఈ వేళ వస్తుందేమో!' అంటుంది నిస్తేజాలయిన ఆ కళ్ళల్లో రేపటిపై ఆశలు నింపుకుంటూ.

కానీ, డాక్టర్ ప్రియ మనస్సు మాత్రం 'ప్రియా! నీకెవరూ లేరు... నీకెవరూ లేరూ... నీకు నువ్వే... నీకు నువ్వే....' అంటూ గొణుగుతుంది.

అవును. నాకు...నేనే... నాకు నేనే....

ఆ ఆవేశంలో నవ్వుతుంది... పిచ్చిగా ఏడుస్తుంది. ఆపైన గంటల తరబడి శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తూ కూర్చుంటుంది డాక్టర్ మిస్.ప్రియ.

* * * *

డాక్టర్ మిస్. ప్రియ ఆలోచిస్తుందీ అనడం కంటే, గడచిన తన జీవితంలోని సంఘటనలను మననం చేసుకుంటుందంటే సరిగ్గా వుంటుంది.

* * * *

"ఐ లైక్ యూ ప్రియా"

"ఐ టూ..."

"ప్రియా! ఐ వాంట్ యూ..."

"బట్, ఐ నాట్..."

"ఐ లవ్ యూ సో మచ్"

ప్రియ నవ్వింది.

కల కూజితంలా, సెలయేటి గలగలలా, పసిపాపలా హాయిగా నవ్వేసింది.

"ఎందుకు నవ్వు..?"

చిన్నబుచ్చుకున్నట్లుగా అడిగాడు డాక్టర్ ప్రవీణ్!

"ప్రేమంటే నవ్వు వచ్చింది డాక్టర్"

"అందులో నవ్వేందుకేముంది...?"

"డాక్టర్. ఎంతోమందియువతీయువకులు ప్రేమ... ప్రేమ... అంటూండగా విన్నాను. మీరూ "ప్రేమ" అంటే నవ్వు వచ్చింది". డాక్టర్ ప్రవీణ్ ప్రియవంక విశితంగా చూశాడు.

ప్రియ వ్యంగ్యంగా మాట్లాడుతోందా...! లేక నిజంగానే ఈమెకు ప్రేమ అనేభావం అనుభవంలోకి రాలేదా...?

పసిపాప అంతఃకరణలా నిర్మలంగా, పవిత్రంగా వుంది ప్రియ వదనం.

ఆ హృదయంలో వ్యంగ్యానికీ, అబద్ధానికీ, మోసానికీ తావులేదు.

డాక్టర్, చిన్న అనుమానం"

"అడుగు"

"ప్రేమంటే...?"

డాక్టర్ ప్రవీణ్ గుండె గొంతులో కొట్లాడింది.

"ప్రేమంటే.... ప్రేమంటే..."

సృష్ట్యాదినుండీ ఇప్పటివరకూ ఈ ప్రశ్నకు జవాబు చెప్పిన వారు లేరు.

ఇక తనేం చెప్పగలడు...?

డాక్టర్ ప్రవీణ్ గుండెకు సంబంధించిన పెద్ద పెద్ద ఆపరేషన్లు అవలీలగా చేసేయగలడే గానీ, పట్టుమని పది మాటలు ఒక్కసారే మాట్లాడలేడు.

మాటలకొరకు తడుముకుంటుంటాడు.

"చెప్పండి డాక్టర్. ప్రేమంటే....?"

"ప్రేమను నిర్వచించడం చాలా కష్టమైన విషయం ప్రియా. నా దృష్టిలో ప్రేమంటే స్త్రీ పురుషులు ప్రాణప్రదంగా ఒకరినొకరు కావాలనుకోవడం..."



"యూ మీన్... యుక్తవయస్సులో కలిగే వా...లకే మరోపేరు ప్రేమ... యామై కరెక్ట్...?"

ఓ... గాడ్... అనుకున్నాడు డాక్టర్ ప్రవీణ్. అపు రూపమైన శిల్పంవంటి ఈమెలో శిల్ప లక్షణాలు తప్ప మనిషికుండవలసిన మానసికమైన కదలికే లేదా...? జాజిమొగ్గవంటి సుకుమారమైన ప్రియలో కొంచెం కూడా ఆర్ద్రతా భావం కనిపించదేం...?"

"అయితే డాక్టర్! ప్రేమ అనేది కేవలం యువతీ యువకులకు మాత్రమే సంబంధించిన భావోద్రేకమంటారా..."

ఈమెకు అర్థం అయ్యేలా చెప్పటం ఎలా..?

ప్రేమ ఎవరి హృదయానికి వారికి అనుభూతం కావాలే తప్ప చెప్తితే అర్థమయ్యేదా...

"ప్రియా! ప్రేమను'ఇదీ'అని ఇంతవరకూ ఎవరూ నిర్వచించలేక పోయారు. తల్లీబిడ్డల మధ్య మమతాను బంధం, భార్యాభర్తల అనురాగం,సోదరీ సోదరుల మధ్య అనుబంధం ఇవన్నీ ప్రేమకు మరోరూపాలే...."

వేసు సెలవుల తరువాత డ్యూటీలో చేరేందుకు వచ్చేప్పుడల్లా అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంది..."

డాక్టర్ ప్రవీణ్ తనకో పెద్ద ఆధారం దొరికినట్లుగా ఆనందపడ్డాడు.

"ఆ!.... ఆ!.... అదే.... అదే... ప్రేమ..." అన్నాడు ఆత్రంగా.

"బట్ దట్స్‌టూ బాడ్. సెంటిమెంటల్ ఫూలిష్‌నెస్"

డాక్టర్ ప్రవీణ్ ఆదిరి పడ్డాడు.

తల్లి బిడ్డ కొరకు తాపత్రయపడటం ప్రియదృష్టిలో సెంటిమెంటల్ ఫూలిష్‌నెస్.

హాస్పిటల్ అప్ స్టైయిర్‌లో కారిడార్‌లో నిలబడి మాట్లాడుకుంటున్నారు డాక్టర్‌ప్రియా, డాక్టర్ ప్రవీణ్.

సూర్యుడు సంధ్యాకాంతతో సరాగాలాడుతూవసంతాలు కురిపిస్తున్నాడు. సాయం సంధ్యారుణ కాంతుల్లో ముగ్ధమనోహరంగా వెలిగిపోతోంది ప్రియ రూపం.

విశాలమైన కనుదోయి, నువ్వుపువ్వు నాసికా, పలుచని ఎర్రని పెదవులూ, ఆ క్రింద కొద్దిగా వంపు తిరిగిన చుబుకమూ, స్నిగ్ధ జ్యోత్స్న కాంతులనూ, మేలిమి బంగారునూ, జాజి పూలనూ, చేమంతులనూ, మందారాలనూ రంగరించి పోసినట్లుగా వున్న శరీరచ్ఛాయా, ప్రవాహం వంటి తలకట్టూ...

జాజిపూల ప్రోవులా ప్రియ...

ఆమె వైపు తదేకంగా చూస్తూ అన్నాడు ప్రవీణ్.

"ప్రియా! ఎప్పుడూ ఎవ్వర్నీ చూడాలని కోరదా నీ హృదయం..."

"నో... డాక్టర్. నా మనస్సెప్పుడూ ఎవరికొరకూ తపించదు"

రెండు సంవత్సరాలుగా డాక్టర్ ప్రియతోకలిసి పని చేస్తున్నాడు ప్రవీణ్. పని పట్ల ఆమె చూపే శ్రద్ధ, గౌరవం అతనికి ముచ్చట కలిగిస్తాయి. నిరంతరం క్రొత్త విషయాలు తెలుసుకోవాలని శ్రమించే విజ్ఞాన ఖని ప్రియ. అపురూపమైన ఆమె సౌందర్యం అతని ఆరాధనా కేంద్రంగా మారితే, విలక్షణమైన ఆమె వ్యక్తిత్వం అతనికో పజిల్.

ఈ రెండేళ్ళ కాలంలోనూ స్త్రీ సహజమైన సిగ్గు, మొహమాటం పిరికితనంవంటి వికారాలు ఆమెలో మచ్చుకు కూడా అతను చూడలేకపోయాడు.

తను చెయ్యాల్సిందేదో అమిత శ్రద్ధగా, జాగ్రత్తగా చేస్తుంది. ఒకవేళ కేసు ఫెయిల్ అయి పేషంట్ చచ్చిపోయినా ఆమె ముఖం ఎప్పటిలా నిర్లిప్తంగానే వుంటుందే తప్ప మరే భావమూ కనిపించదు.

"అయితే ప్రియా! నువ్వెప్పటికీ పెళ్ళిచేసుకోవా?"

ప్రియ చిరునవ్వు నవ్వుతూ అంది.

నా పెళ్ళి అయిపోయింది డాక్టర్.

"వాట్...?"

"యస్ డాక్టర్. నా పెళ్ళివృత్తితో అయిపోయింది. ఐ మారీడ్ మై ప్రొఫెషన్"

"ప్రియా! నీ హృదయంలో నాపట్ల ప్రేమ భావం అంకురించేవరకు వేచి వుండగలను. ప్లీజ్ మరోసారి ఆలోచించు"

"సారీ డాక్టర్" 'ప్రేమ ' అనే ఫూలిష్ సెంటిమెంట్ నన్ను ఎప్పటికీ అంటదు.

"ప్రేమ, మమత అనేవి మానవ సహజమైన గుణాలు. జీవితంలో ప్రతి మనిషినీ ఎప్పుడో అప్పుడు ఆ భావాలు తాకకపోవు.

మనకోసం బాధపడే హృదయంకొరకు, ఓ కన్నీటి బొట్టునురాల్చగల మమత కొరకు, హృదయం కొరకు తపించి పోయే క్షణాలు ప్రతిజీవితంలోనూ తప్పకుండా వుంటాయి.

అయితే ఆ భావాలకు కొందరు ముందుగా స్పందిస్తే మరికొందరు కాస్త ఆలస్యంగా స్పందిస్తారు.

అయితే స్పందన అనేది మాత్రం మానవ సహజం"

డాక్టర్ ప్రవీణ్ మాటలు ఆనాడు చాలా అయిష్టంగా, నిర్లిప్తంగా విని వదిలేసింది ప్రియ.

ఆ తరువాత కూడా ఆమెను ప్రేమించి పెళ్లాడ కోరిన డాక్టర్ ప్రభాకర్‌నూ, డాక్టర్ దివాకర్‌నూ, డాక్టర్ హిమవంత్‌నూ అలాగే మృదువుగా తిరస్కరించి "మిస్" గానే మిగిలిపోయింది.

* * * *

టంగ్... టంగ్.... టంగ్.....

గడియారం పన్నెండుగంటలు కొట్టి అప్పటి తన బాధ్యత తీర్చుకుంది. గంటల శబ్దం ఆలోచనలకు అంతరాయం కలిగించగా డా.మిస్.ప్రియ తల ఎత్తి గడియారం వంక చూపు తిప్పింది.

చూపు సరిగ్గాఆనక కంటికి చెయ్యి అడ్డుపెట్టుకుని మరీ చూసింది. ఊహూ... కంటి చూపు బొత్తిగా ఆనడంలేదు... గొణుక్కుంటూ నిట్టూర్పువిడిచింది.

ఈ వ్యధాభరితమైన జీవితాన్ని ఇంకెంతకాలం భరించాలో... గొణుక్కుంటూ నెమ్మదిగా లేచి వెళ్ళి పడకగదిలోమంచం మీద నడుం వాల్చింది.

చిరునవ్వులు చిందిస్తూన్న అమిత్ ఫోటో వంక చూసింది. కళ్ళు చికిలించుకుంటూ ఫోటోవంక ప్రేమ



గా చూసింది.

అమిత్ కళ్ళల్లో కాంతి వుంది.

ఆ ముఖంలో విజ్ఞానం, సౌందర్యం పోటీ పడుతున్నాయి. అయినా పసితనం పోని ముఖం అమాయకంగావుంది.

కన్నీటి పొరలు కమ్మిన కంటికి బొమ్మ సరిగా ఆనలేదు.

పవిట చెంగుతో కళ్ళు గట్టిగా ఒత్తుకుని మరీ చూసింది.

ఈ సారి ఫోటోలోని అమిత్ మాట్లాడినట్లనిపించింది.

''డాక్టర్! మీరు... మీరు...ఏడుస్తున్నారా...?''

* * * *

ప్రొఫెషన్... ప్రొఫెషన్... ప్రొఫెషన్.....

రాత్రి పగలూ మరో ఆలోచన లేకుండా ప్రొఫెషన్ లో మునిగిపోయింది డాక్టర్ మిస్ ప్రియ.

మధ్యవయస్సు వచ్చేనాటికి డాక్టరుగా జాతీయంగా, అంతర్జాతీయంగా మంచి కీర్తిప్రతిష్ఠలు సంపాదించుకోగలిగింది.

ప్రప్రథమంగా టెస్ట్ ట్యూబ్ బేబీ జననం జరిగింది. టెస్ట్ ట్యూబ్ బేబీ జననం సైన్స్ 'విజయం'గా మాత్రమే మిగిలిపోయింది. కానీ, జన సామాన్యంలోకి ప్రచారం కాలేదు. ఆ ప్రక్రియకు విస్తృత ప్రచారం లభించలేదు.

సమాజంలో గొడ్రాలిగా ముద్రపడి పసిబిడ్డల కొరకు తపించిపోయే స్త్రీలకు టెస్ట్ ట్యూబ్ బేబీ ప్రక్రియ వరప్రసాదం.

టెస్ట్ ట్యూబ్ బేబీ ప్రక్రియ జన సామాన్యంలో అధిక ప్రచారం కల్పించేందుకు అధికంగా కృషి సల్పుతోంది డాక్టర్ మిస్ ప్రియ.

ఈ ప్రక్రియలో సామాన్య ప్రజానీకానికి తానే ఓ మోడల్ గా నిలిస్తే...

తండ్రి ఎవరో తెలీని బిడ్డకుతల్లి కాబోతోంది డాక్టర్ మిస్ ప్రియ.

తండ్రి ఎవరో తెలియక పోయినా అతను ఏదో ఒక రంగంలో అఖండమైన ప్రజ్ఞావంతుడనే విషయం నిర్వివాదాంశం. అలాంటి వ్యక్తుల ''స్పెర్మ్ నే'' సేకరించి భద్రపరుస్తారు సైంటిస్టులు. తన గర్భాన్నీ, అందులో పెరిగే బిడ్డనూ సైంటిఫిక్ స్పెసిమన్ గానే ట్రీట్ చేసింది డాక్టర్ మిస్ ప్రియ.

ముద్దులు మూటగట్టే ''అమిత్'' జన్మకూడా ఆమెలో మాతృత్వపు మమకారాన్ని స్పృశించలేదు.

అమిత్ ఆలనా పాలనా కొరకు ఒక ఆయాను ఏర్పాటు చేసింది.

వచ్చీరాని ముద్దుమాటలు మాట్లాడే వయస్సులో అమిత్, ఆయా, నర్సుల లాగే ప్రియను ''డాక్టరుగారూ...'' అని పిలచేవాడు. ఆ పిలుపును సవరించి ''మమ్మీ'' అని పిలిపించుకోవాలనే ప్రయత్నమేదీ చెయ్యలేదు డాక్టరు మిస్ ప్రియ.

''డాట్టులుగాలూ! నేనూ ఆచపత్రికి వత్తానూ..'' అనే అమిత్ ముద్దుమాట విని, ''అలాగే...''అనేదికానీ ఆ పసికందులోని ఆత్మీయతా భావం ఆమె మనసును తాకేదికాదు.

చదువుకునే వయస్సు రావడంతోనే డాక్టర్ మిస్ ప్రియ అమిత్ ను మంచి కాన్వెంట్ స్కూల్లో చేర్పించింది. అప్పుడే ఆమెకు కొన్ని చిక్కు ప్రశ్నలు ఎదురయ్యాయి.

''బాబు ఫాదర్ పేరు చెప్పండి'' ప్రిన్సిపాల్ అడిగింది.

డాక్టర్ మిస్ ప్రియ గతుక్కుమంది.

ఎవరిపేరు చెప్పడం...? బాబు తండ్రి ఎవరో తనకు తెలిస్తేగా...

''ఫరవాలేదు. గార్డియన్ గా నాపేరు వ్రాసుకోండి'' అంది

''గార్డియన్ గా మీపేరు వున్నా ఫాదర్ నేమ్ వ్రాయాలి మేడం...''

''బాబు టెస్ట్ ట్యూబ్ బేబీ...''

ఎలాగో ఎడ్మిషన్ పూర్తయిందనిపించారు ప్రిన్సిపాల్

అమిత్ అభివృద్ధికి కావలసిన సకల సౌకర్యాలూ సమకూర్చింది డా.మిస్ ప్రియ.

అతని చదువుల గదిని ఓ ప్రయోగశాలలా తీర్చిదిద్దింది.

అమిత్ చదువులో, ఆటల్లో మంచి చురుగ్గా, స్కూల్ ఫస్ట్ గా వస్తున్నందుకు చాలా గర్వించింది.

డాక్టర్.మిస్ప్రియ ప్రొఫెషన్ లో పడి కాలగమనం మరిచిపోయింది.

అమిత్ యువకుడయ్యాడు.

చదువులోఒక్కో మెట్టే ఎక్కి వచ్చిఅతి పిన్న వయస్సులోనే మంచి ప్రతిభగల డాక్టరయ్యాడు.

కార్డియాలజీలోస్పెష్లైజ్ చేశాడు.

అమిత్ కు ఫారిన్ ఛాన్సు వచ్చింది.

ఆ వార్తను చాలా సాధారణగా రిసీవ్ చేసుకుంది డా.మిస్ప్రియ.

అమిత్ కు సెండాఫ్ ఇచ్చేందుకు ఎయిర్ పోర్ట్ కు వెళ్లింది.

ఇప్పుడామెకు యాభై అయిదేళ్ళు.

దేశంలోవున్న కొద్దిమంది మంచి డాక్టర్లలో ఆమె ఒకరు.

ప్లేన్ రన్ వే మీద ఆగివుంది.

ప్రయాణీకులను కూర్చోమంటూ తన మధురమైన స్వరంతో ఎనౌన్స్ చేసింది ఎనౌన్సర్.


''అమిత్ వెళ్లబోతూ అన్నాడు—

''గుడ్ బై డాక్టర్...''

అదిగో... అప్పుడే...''

అపుడే మొదటిసారిగా డాక్టర్ మిస్ ప్రియ తల్లి పేగు కదలింది.

''ఒ.కె....విష్ యూ ఆల్ ద బెస్ట్...'' అంది




గొంతు పెగల్చుకొని.

అమిత్ చక చకా అడుగులు వేస్తూ ప్లేన్‌వైపు వెళ్లాడు.

అమిత్‌ను వెళ్ళనివ్వకు.... అంది అతనిలోని తల్లి ప్రేగు.

"అమీ..." అంటూ గుండెలను చీల్చుకుని వచ్చిన పిలుపు పెదవులను మాత్రం దాటి రాలేదు.

అయితే ఒక్కసారి తిరిగి మాస్తాడేమో అని ఆశగా మాసింది. ఒక్కసారి... ఒక్కసారి అమిత్ వెనుతిరిగి మాస్తే బావుండుననీ కోరుకుంది.

అమిత్ వెనుతిరిగి చూడకుండానే చకచకా స్టెప్స్ ఎక్కి లోపలికి వెళ్ళిపోయాడు.

డా.మిస్‌ప్రియ గాలిలోకి చెయ్యి ఊపింది అమిత్‌కు కనిపించాలనే ఆశతో.

ప్రయాణీకులందరూ ఎక్కడం పూర్తి కావడం తోనే ప్లేన్ తలుపులు మూసుకున్నాయి.

అదిగో..... అప్పుడు....

అప్పుడు చేరింది డాక్టర్ మిస్ ప్రియ కళ్ళల్లోకి ఓ కన్నీటి తెర. కర్చిఫ్‌తో తుడుచుకుంటున్నకొద్దీ కళ్ళల్లో ఊరుతోందా తడి.

ఏరోడ్రోం నుండి ఇంటికి వచ్చిన డా.మిస్‌ప్రియ జీవితంలో మొదటిసారిగా ఒంటరితనం ఫీలయింది.

అమిత్ ఉండగా కూడా ఇద్దరికీ కాంటాక్ట్స్ లేకపోయినా ఇప్పుడు అమిత్‌లేని లోటు మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

క్రమేపీ ఆ ఒంటరితనం పెరిగి పెరిగి పెద్దబ్రహ్మ రాక్షసిలా ఆమెను కబళించేందుకు సిద్ధంగా వున్నట్లని పించింది.

అమిత్ ఎలా వున్నాడో... ఏం చేస్తున్నాడో.. అనే ఆలోచనలు. అమిత్ ఫారిన్ వెళ్ళకుండా తిరిగి వచ్చేస్తే బావుండును అని కూడా కోరుకోసాగిందామె మనస్సు.

అమిత్... అమిత్... అమిత్...

ప్రతిక్షణం ఆమె ఆలోచనల్లో అమిత్... ఆమె కళ్ళ ల్లో అమితే.... ఆమె గుండెల్లో అమితే.

ఇంతకుముందెప్పుడు అనుభవించి ఎరుగని వేదన... ఆరాటం..... పరితాపం....

అమిత్‌ను చూడాలనే గాఢమైన కోరిక నరనరాన్నీ పట్టి పీడిస్తుంటే కలిగిన వేదన...

అప్పటికప్పుడు ఈ అగాధాలన్నింటినీ దాటి వెళ్లి ఆర్తిదీరా అమిత్‌ను గుండెలకు హత్తుకోవాలనీ, చెంపలు నిమరాలనీ, ప్రేమగాముద్దాడాలనీ, పసివాడిగా లాలి స్తూగోరుముద్దలు తినిపించాలనీ. ప్రేమ....

ప్రేమంటే ఇదేనా...?

తననింతగా క్షోభ పెడ్తూన్న ఈ ప్రేమ ఇన్నాళ్ళూ ఎక్కడ దాక్కుంది? అమ్మ కన్నీళ్ళకు అర్థం ఇప్పుడు బోధ పడుతోంది.

ప్రవీణ్ వేడికోలు లోని 'ఆత్మీయత'ఇప్పుడుఅవగత మవుతోంది.

ఇప్పుడు డాక్టర్ మిస్ ప్రియ కళ్ళల్లో మాటిమాటికి తడిచేరి అవి ఉప్పొంగి జలపాతాలవుతున్నాయి.

అమిత్ వెళ్ళిన తరువాత నెలకు ఒక్క లెటర్ వ్రాశాడు చాలా క్లుప్తంగా.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్..."

"ఇక్కడంతా ఒ.కె.."

"ఐ లైక్ దిస్ లొకాలిటీ.."

"అమిత్"

ఆ లెటర్ ఆమె గుండెను పిండింది.

అమిత్‌నుండి ఆమె ఆత్మీయమైన లెటర్ కోరు కొంటోంది తన జాబుకు బదులుగా.

అమిత్ "మమ్మీ" అని వ్రాస్తే...

అమిత్ నోట ఆ పిలుపు ఎంత మధురంగా వుంటుందో...

కానీ, పసితనం నుండే తాను ఎరుగని, కోరుకున్న మమకారపు ఊట ఆమెను నిలువెల్లా ముంచెత్తుతోం దని అతనికెలా తెలుస్తుంది...?

జీవితంలో ఏనాడూ ఏడవనంతగా కుమిలి కుమిలి ఏడ్చింది మాతృప్రేమతో గుండెలు రగిలిపోగా.

కాలం గడుస్తున్న కొద్దీ వయస్సును మించిన వార్ధక్యం ముట్టుముట్టుతుండగా అమిత్‌నుండి వచ్చే జాబు కొరకు నిరీక్షించడం ఆమె నిత్యకృత్యం అయి పోయింది.

* * *

"వాటీజ్ లవ్...?"

ఆనీ చటుక్కున తల ఎత్తింది.

తేనె రంగు బాబ్డ్ హైర్ సముద్రపు అలలా విరిగిపడింది.

"వాటీజ్ లవ్..? మళ్ళీ అడిగాడు డాక్టర్ అమిత్. మిస్ ఆనీ చిన్నగా నవ్వింది. ఎర్రని ఆమె చిన్ని పెదవులు అందంగా వంపుతిరిగి ఆరోగ్యవంతమైన తెల్లని పలువరస తళుక్కుమంది.

"ద లవ్ ఈజ్ దట్ విచ్ ఈజ్ నాట్ లాస్ట్"

"ఆనీ!నువ్వెవరినైనా ప్రేమించావా...?"

"ఆ!..."

"ఎవరిని....?"

కుతూహలంగా అడిగాడు అమిత్.

కుతూహలం అనేది ఇండియన్స్‌కు బై బర్త్ సంక్ర మించే సహజాతం. ఆనీ కాసేపు మౌనంగా ఉండి పోయింది. ఆ తరువాత నెమ్మదిగా అంది.

"ఐదేళ్ళ పాపగా వున్నప్పుడు మమ్మీని ప్రేమించే దాన్ని. పదేళ్ళ వయస్సులోప్రక్కింటి అంకుల్‌ను ప్రే మించేదాన్ని. నౌ ఐయామ్ ఇన్ లౌ విత్...."

ఇక చెప్పలేనట్లుగా కళ్ళు వాల్చేసుకుంది ఆనీ.

"నువ్వు అంతగా ప్రేమించే వాళ్ళు ఇప్పుడు నీతోనే వుంటున్నారా ఆనీ"

"నో... నౌ ఐయామ్ ఎలోన్...."

"ఓహ్..."

మమ్మీ డాడీకి డైవర్స్ చేసి తనకంటే పదిహేనేళ్ళు చిన్నవాడైన ప్రక్కింటి అంకుల్‌నుపెళ్ళిచేసుకుని వెళ్ళి పోయింది. నేను డాడీతోనే వుండిపోవాల్సి వచ్చింది.

డాడీ తనకంటే పెద్దదయిన ఓ స్త్రీని పెళ్ళి చేసుకున్నాడు.

నాకు అసహ్యం వేసి ఇల్లు వదిలి వచ్చేశాను"

"ఆనీ! ఇంత బాధను గుండెల్లో ఇముడ్చుకొని ఇంత హాయిగా ఎలా నవ్వగలుగుతున్నావు...?"

ఆనీ నవ్వింది.

"అమిత్ జీ! ఇక్కడ ప్రతి వ్యక్తి వెనకా ఇంచు మించు ఇలాంటిదే ఓ కథ తప్పకుండా వుంటుంది. ఇది మా కమ్యూనిటీలో చాలా మామూలు విషయం"

అమిత్ ఆలోచిస్తున్నట్లుగా మౌనంగా వుండి పోయాడు.

"డాక్టర్. మీరెప్పుడూ ఎవరినీ ప్రేమించలేదా?"

"లేదు.."

"నేను అడిగేది గర్ల్‌ఫ్రెండ్స్ గురించికాదు"

"నేను చెప్పేది కూడా వారి గురించికాదు"

"మీ పేరెంట్స్...."

"నేను టెస్ట్ ట్యూబ్ బేబీని."

"ఆఫ్‌కోర్స్. ఫాదర్ తెలీకపోయినా మదర్ వుం టారుకదూ...?"

"మా మదర్ డాక్టర్ మిస్.ప్రియకునేనోసైంటిఫిక్ స్పెసిమన్‌ను మాత్రమే... ఆమెకు నాతో ఎలాంటి ఎటాచ్‌మెంట్స్ లేవు"

"పోనీ ఆమె అంటే మీకు..."

"ఇండియన్స్ ఆర్ సెవన్‌టీ ఫైవ్ క్రోర్స్..."

"అఫ్‌కోర్స్..."
ఆనీ కళ్ళు రెపరెపలాడాయి.
"ఆ డెబ్బై అయిదుకోట్ల ప్రజల్లో ఆమె ఒకరు"
అతని స్వరంలోని విషాదం ఆమెను కదిలించింది.
"బాధ పడుతున్నారా....?"
"నో! నాట్ ఎటాల్"
"మీ ఇండియన్స్‌లో పిల్లలకు తగిన సెక్యూరిటీ ఉంటుంది. మాలోలా కాదు. ఫామిలీ లైఫ్ ఎటాచ్‌మెంట్స్ ఎక్కువ"
"అఫ్‌కోర్స్. కానీ, ఈ విషయంలో మా వాళ్ళు పాశ్చాత్య దేశాలతో పోటీపడుతున్నారు"
బ్రెడ్ స్లైస్‌కు జామ్ రాసి ఒక్కొక్కటీ అమిత్ నోటికి అందిస్తూన్న ఆనీ చటుక్కున తల ఎత్తి చూసింది.
ఆమె తెనె రంగు కళ్ళల్లో ఆశ్చర్యం అందంగా తొణికిసలాడింది.
"యూ మీన్..."
"రానురాను మా ఇండియన్స్‌లోనూ కృత్రిమత్వం పెరిగి ఎఫెక్షన్స్ తగ్గిపోతున్నాయి"
మిస్ ఆనీ ఆలోచిస్తున్నట్లుగా మౌనంగా వుండి పోయింది. ఆమె వంకే చూస్తూ బ్రెడ్ తింటున్నాడు అమిత్.
పదిహేను రోజులుగా అతను తీవ్రంగా జ్వర పడ్డాడు. ఈ పదిహేను రోజులుగా ఆత్మీయత నిండిన నర్స్ ఆనీ సేవలు అతని అంతరాంతరాలలో అణగారిపోయివున్న మమత, ప్రేమ అనే అనుభూతులను సున్నితంగా స్పృశించి వదిలాయి.
బాల్యంలో తను అనేకసార్లు జబ్బు పడ్డాడు.
ఆయా సేవలు చేసేది.
ఆమె సేవలో బాధ్యత తప్ప ఆత్మీయత కనిపించ లేదు.
డాక్టర్ మిస్ ప్రియ డాక్టరుగా ట్రీట్‌మెంట్ ఇచ్చేది.
కానీ అందులోడాక్టరుగా ఆమె వృత్తిధర్మం తప్ప, మమతకూ, ప్రేమకూ, ఆత్మీయతకూ చోటులేదు.
కానీ, ఆనీ సేవలలో బాధ్యత, వృత్తి ధర్మానికి మించిన మరేదో అతని మనస్సును స్పృశించింది.
అతనిలో నిద్రాణమైవున్న మమతను సున్నితంగా తాకింది.

"ఆనీ! నేనంటే నీకెందుకింత దయ...?"
ఆనీ మనస్సులో అనుకుంది.
"దయకాదు డాక్టర్, 'ప్రేమ'.... ఎందుకంటే ఇతర మగాళ్ళలా మీరు నాశరీరాన్ని ఆశించరు.పసివాడి లాంటి మీ చూపుల్లో అవాంఛనీయమైన కామానికీ, మోహానికీ, కృత్రిమత్వానికీ, కల్మషానికీ తావులేదు.
ప్రేమకొరకు పరితపిస్తున్న నా హృదయంలో మీ పవిత్రమూర్తి నిండి వుంది. నాపట్ల మీలో ప్రేమ జ్యోతి వెలిగేవరకూ ఎదురు చూస్తాను. ఐ ఎవెయిట్ యూ...."
అమిత్ అలసిపోయినట్లుగా కళ్ళుమూసుకున్నాడు.
ఆనీ జాగ్రత్తగా బ్లాంకెట్ కప్పుతూ అంది.
"డాక్టర్. బాగా అలసిపోయారు.కాసేపు రెస్ట్ తీసుకోండి"
అమిత్ ఆనీ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.
"మిస్ ఆనీ! ఐ లైక్ యూ...."
"ఐ టూ..."
ఆనీ పెదవులు ప్రేమగా అతని నుదుటిని ముంబించాయి.

* * * *

ఆ తరువాత మరో రెండేళ్ళకు—
"డాక్టర్ నేను పెళ్ళి చేసుకుంటున్నాను" అని వ్రాశాడు అమిత్.
అంతే.... అదే ఆఖరి జాబు.
కానీ, డాక్టర్ మిస్ ప్రియ మాత్రం నిరీక్షించడం మానలేదు.

* * * *

టంగ్..... టంగ్.... టంగ్....
గడియారం వరుసగా ఏడుగంటలు కొట్టి తన పని తీర్చుకుంది.
మగతలో నుండి డాక్టర్ మిస్ ప్రియ ఉలిక్కిపడి కళ్ళు విప్పింది.
గదిలో అల్లుకున్న చీకట్లు చిక్కబడ్డాయి.
ఎదురుగా అమిత్ ఫోటో చీకటిలో కలిసిపోయి తన అస్తిత్వాన్ని కోల్పోయింది.
బాగా చీకటి పడిపోయింది.... గొణుగుతూ మంచంనుండి దిగి గోడను ఆసరాగా చేసుకుంటూ వెళ్లి తడుముకుంటూ స్విచ్ నొక్కింది. గదిలో మిరుమిట్లు గొలుపుతూ వెలుగు పరుచుకుంది.
డాక్టర్ మిస్ ప్రియ కళ్ళు చీకట్లు కమ్మాయి.
పవిట చెంగుతో కళ్ళు పదేపదే ఒత్తుకుంటూ అతిశ్రమ మీద వెలుగును చూసేందుకు ప్రయత్నించింది.
క్రమంగా మసకబారిన ఆమె కళ్ళు వెలుగును చూసేందుకు అలవాటు పడ్డాయి.
ఫోటోలో అమిత్ నీడలా మసకగా కనిపించాడు.
డాక్టర్ మిస్ ప్రియ అతిప్రయాసతో వంటగదిలోకి వెళ్ళి కాస్త బ్రెడ్, కొంచెం పాలతో కడుపు నింపుకుని గదిలోకి వచ్చి వణుకుతున్న చేతులతో పక్క దులిపి సరిచేసుకుని, ఫోటో వంక చూస్తూ నడుం వాల్చింది.
ఈ ఒంటరి జీవితం తనకు మొదటినుండీ అలవాటే, అయినా ఏరోజుకారోజు ఇంత భారంగా, క్రొత్తగా దుర్భరంగా గడుస్తోందేం...?
తనుతాను ప్రశ్నించుకుంది డాక్టర్ మిస్ ప్రియ.
కొడుకులూ, కోడళ్ళ ఆదరణతో, మనుమలూ మనుమరాళ్ళ ముద్దుముద్దు పలుకులతో, వారి నుండి చిన్నిచిన్ని సేవలు అందుకుంటూ హాయిగా నిశ్చింతగా కాలక్షేపం చేసే అదృష్టవంతులను అనేకమందిని చూసింది. వృద్ధాప్యంలో 'నా' అనే తోడులేక మమతకోసం మొహం వాచిపోయిన అర్తులను చూసింది.
అందరూ వుండీ ఎవరి ఆదరణకూ నోచుకోక నికృష్ట జీవితాలను ఈడ్చే నిర్భాగ్యులను చూసింది.
డాక్టరుగా రకరకాల వ్యక్తులతో పరిచయం.
కానీ, అవేవీ ఆనాడు మనస్సుకు అంటలేదు.
మానవజన్మకు వృద్ధాప్యం శాపం.
తనవంటి దురదృష్టవంతులకు జీవితమే శాపం.
అమీకి పిల్లలెందరో...?
తన జీవితకాలం ముగిసేలోగానైనా అమీనీ అతని కుటుంబాన్నీ చూడగలుగుతుందా?
"నానమ్మా"అనే పిలుపు వృద్ధాప్యంలో చేతికర్రలా రక్షణ ఇస్తుంది. మనస్సుకు తృప్తినిస్తుంది.
అమీత్, అతని భార్యా పిల్లలూ వచ్చినట్లూ, మమ్మీ, అత్తయ్యా, నానమ్మా....' పిలుపుల మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్లూ ఊహించుకుని ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది డాక్టర్ మిస్ ప్రియ. ఆమె ఆ ఊహల్లోకూడా బ్రతకడం ఇష్టంలేనట్లుగా కర్కశంగా మోగుతూ ఆమెకలలను చెదరగొట్టింది గోడగడియారం.
ఒకటి..... మూడు.... పది..... పదకొండు...
మరునాడు రాబోయే పదకొండుగంటల కొరకు ఆశగా నిరీక్షిస్తోంది డాక్టర్ మిస్ ప్రియ.
ఆమె కళ్ళల్లో రేపటి పైన ఆశలు...

